మెరుగైన బోధనే లక్ష్యం

- డీఈవో రాజు
- ఉపాధ్యాయులకు ప్రారంభమైన శిక్షణ తరగతులు



తాడ్వాయిలో మాట్లాడుతున్న డీఈవో రాజు

బాన్సువాడ రూరల్/ నస్రుల్లాబాద్ / పిట్లం/ బిచ్కుంద/ నిజాంసాగర్/ రాజంపేట/ఎల్లారెడ్డి/ లింగంపేట/తాడ్వాయి/భిక్కనూరు/సదాశివనగర్/మద్నూర్/నాగిరెడ్డిపేట : జిల్లాలోని పలు మండలాల్లో ఎస్జీటీ, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌లకు ఐదు రోజుల పాటు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం అధికారులు ప్రారంభించారు. బాన్సువాడ మండలం బోర్లం జెడ్పీహైస్కూల్‌లో ఈశిక్షణ శిబిరాన్ని ఎంఈవో నాగేశ్వరరావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట రమణతో కలిసి ప్రారంభించారు. నస్రుల్లాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణను ఎంఈవో చందర్ ప్రారంభించారు. పిట్లం జెడ్పీహెచ్ఎస్ లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణను ఎంఈవో దేవి సింగ్ ప్రారంభించారు. బిచ్కుందలో శిక్షణ తరగతులను ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. నిజాంసాగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణను ఉమ్మడి మండలాల ఎంఈవోలు అమర్‌సింగ్, తిరుపతిరెడ్డి ప్రారంభించారు. రాజంపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ఎంఈవో పూర్ణచందర్ ప్రారంభించారు. భిక్కనూరులో నిర్వహించిన ఎస్జీటీ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎల్లారెడ్డి కస్తూర్బా పాఠశాలలో ఎస్జీటీల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో రాజులు ప్రారంభించారు. రామారెడ్డిలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ఎంఈవో ఆనంద్‌రావు ప్రారంభించారు. లింగంపేట మండలానికి చెందిన ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణను కొల్లాపూర్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులనుద్దేశించి ఎంఈవో షౌకత్ అలీ మాట్లాడారు. తాడ్వాయి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను డీఈవో రాజు ప్రారంభించారు. సదాశివనగర్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ఎంఈవో యోసెఫ్ ప్రారంభించారు. ఉమ్మడి మద్నూర్, డోంగ్లీ మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణను ప్రారంభించినట్లు సెంటర్ ఇన్‌చార్జిలు శ్రీనివాస్, సునీల్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలోని మోడల్‌స్కూల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వహించే ఎస్జీటీలతోపాటు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలకు చేపట్టిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా డీఈవో రాజు, ఆయా మండలాల ఎంఈవోలు మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణ సందర్భంగా సమయ పాలన పాటిస్తూ ఐదురోజులు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని కోరారు. మెరుగైన బోధనే లక్ష్యంగా ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించిందన్నారు. వృత్తి నైపుణ్యాలను మెరుగు పర్చుకోవడానికి శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. నేర్చుకున్న కొత్త విషయాలను తరగతి గదుల్లో అమలు పరుస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండల రిసోర్స్ పర్సన్లు, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.



భిక్కనూరులో .. ఎంఈవో రాజ్‌గంగారెడ్డి



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎంఈవో చందర్



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎంఈవో రాజులు



నిజాంసాగర్‌లో.. ఎంఈవో అమర్‌సింగ్

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- లబ్ధిదారులకు చెక్కుల అందజేత
- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పక్కన కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా వైద్య ఖర్చులు సైతం అందజేస్తుందన్నారు. నియోజకవర్గంలోని 113 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 42.40 లక్షల చెక్కులు, కోటగిరి, వర్ని, రుద్రూర్ మండలాలకు చెందిన 77 మంది లబ్ధిదారులకు రూ.77.08 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మాచారెడ్డిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

మాచారెడ్డి /రాజంపేట/దోమకొండ/భిక్కనూరు : కామారెడ్డి నియోజకవర్గంలో పలు మండలాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు మాచారెడ్డి రైతు వేదికలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కేవీఆర్ మంగళవారం పంపిణీ చేశారు. రాజంపేట రైతువేదికలో మండలంలోని ఆరుగురు లబ్ధిదారులకు, దోమకొండ రైతు వేదికలో 18 మంది లబ్ధిదారులకు, భిక్కనూరు రైతు వేదికలో 25 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు గోపిబాబు, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్లు సంజయ్‌రావు, శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సుమలత, ఆర్ఐ రాజిరెడ్డి, బీజేపీ నాయకులు తదితరులున్నారు.

పగలే.. వెలుగులు



మండలంలోని టికారం తండాలో పగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. దీంతో గ్రామపంచాయతీలకు వేలరూపాలయ బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. పెద్దకొడప్‌గల్(జుక్కల్)

క్లుప్తంగా

నిబంధనల ప్రకారం ఎరువులు అందించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : రైతులకు నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని బాన్సువాడ ఏడీఏ అరుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల వివరాలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారిణి భవాని, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

'మున్నూరుకాపు సంఘం మండల కమిటీల ఎన్నికలు పూర్తి'



కామారెడ్డి అర్బన్: జిల్లాలో మున్నూరుకాపు సంఘం అన్ని మండలాల కమిటీల ఎన్నికలను పూర్తి చేసి ప్రతినిధులకు ధ్రువపత్రాలను అందజేసినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్‌రావు పటేల్, పి.అంజయ్య పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలో మున్నూరుకాపు సంఘం జిల్లా సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. మండల కమిటీలు గ్రామ కమిటీలకు ఎన్నికలకు నిర్వహించాలని ఆదేశించినట్లు శ్రీనివాస్‌రావు పటేల్ అన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 25న ప్రతిభ పురస్కారాలు అందజేస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, యూత్ అధ్యక్షుడు కాసుల రోహిత్, మహిళా జిల్లా అధ్యక్షురాలు బాజ లలిత, జిల్లా బాధ్యులు ప్రదీప్, ప్రకాష్, గంగాధర్, కుంటి అంజనేయులు, సంకరి రాజలింగం, తోట భూమయ్య తదితరులున్నారు.

గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి



రామారెడ్డి : గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడం లేదని మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రామారెడ్డిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. మూడు కోట్ల 8 లక్షల నిధులతో గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టమన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవ తీసుకొని వానాకాలం లోపు బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ బ్రిడ్జి మీదుగా 18 గ్రామాల ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తారని, జిల్లా కేంద్రానికి ఎంతోమంది వెళ్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలభైరవ ఆలయ మాజీచైర్మన్ గంజి సతీష్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్, శంకర్ జి, జంగం లింగం, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



దోమకొండ: మండలస్థాయి యూత్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. గత మూడు రోజులుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ప్రథమ స్థానంలో విజేతగా నిలిచిన స్ట్రీట్ 11 దోమకొండ జట్టుకు రూ.5555, , రన్నరప్ టీమ్‌కు రూ.3333 నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, దోమకొండ కాంగ్రెస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ సీతారాం, మధు, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పాల్కంపేట గ్రామంలో మంగళవారం ఎంపీవో మలహరి నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఏపుగా పెరగడానికి ప్రతి రోజు నీళ్లు పోయాలని సూచించారు. అలాగే గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగిస్తున్న పనులను పరిశీలించారు. మురికి కాల్వల్లో పూడిక తీయించారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి అశ్వక్, సిబ్బంది ఉన్నారు.

నిబంధనల ప్రకారం ఇళ్లు కట్టుకోవాలి



వెంకంపల్లిలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

- ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్
- పలు చోట్ల ఇళ్లకు మార్కింగ్



బేగంపూర్‌లో ఇళ్లకు భూమి పూజ చేసిన అధికారులు

నాగిరెడ్డిపేట/పెద్దకొడప్‌గల్/నిజాంసాగర్/లింగంపేట/తాడ్వాయి : ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నిబంధనల ప్రకారం కట్టుకోవాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని వెంకంపల్లిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వ కొలతల ప్రకారం ఇళ్లను కట్టుకోవాలన్నారు. మార్కింగ్ చేసుకున్న వెంటనే నిర్మాణం పనులను ప్రారంభించాలన్నారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి రజిత ఉన్నారు. నాగిరెడ్డిపేట మండలం బంజారతండాలో, రాఘవపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపీడీవో ప్రభాకరచారి ఆధ్వర్యంలో మార్కింగ్ చేశారు.లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్, విఠల్‌వాడి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల ప్రత్యేకాధికారి కిషన్ భూమి పూజ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇళ్లను నిర్మించుకోవాలని ఆయన అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని నిజాంసాగర్ మండల ప్రత్యేకాధికారిణి ప్రమీల లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లింగంపేటతో పాటు పొల్కంపేట, సురాయిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో సురేందర్ మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాడ్వాయి మండలం కృష్ణాజీవాడిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల ప్రత్యేక అధికారి రాజారాం మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 457 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 150 ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేశామన్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల జీపీ కార్యదర్శులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



నాగిరెడ్డిపేటలో నల్లపోచమ్మ ఆలయానికి బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

సదాశివనగర్/తాడ్వాయి/నాగిరెడ్డిపేట : నాగిరెడ్డిపేట గ్రామంలో మంగళవారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ఘనంగా బోనాలపండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గ్రామంలోని ముత్యాల పోచమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మ మాత , గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. సాయంత్రం మండలకేంద్రం గోపాల్‌పేటలోని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. మహిళలు ఒడిబియ్యం పోశారు. బోనాల ప్రదర్శనలో భాగంగా పోతరాజుల విన్యాసాలు పలువురికి ఎంతగానో ఆకట్టుకున్నాయి. సదాశివనగర్ మండలం కల్వరాల్ గ్రామంలో గ్రామ దేవతలకు బోనాలను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. తాడ్వాయిలో మాదిగ, మెట్టు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. గ్రామ శివారులో గల పోచమ్మకు బోనాలు సమర్పించారు.



నాగిరెడ్డిపేటలో బోనాలను ఎత్తుకొని మహిళల విన్యాసాలు



కల్వరాల్‌లో..

సంక్షిప్తం

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్, ముగ్ధంపూర్ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తెలిపారు. బూర్గుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడి సాయాగౌడ్, ముగ్ధంపూర్ గ్రామ కమిటీ అధ్యక్షు డిగా అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మోహిన్‌ను ఎన్నుకున్నామన్నారు. నాయకులు లోక్యానాయక్, సవాయిసింగ్, మల్లయ్యగారి. ఆకాష్ తదితరులు ఉన్నారు.

బాన్సువాడలో వర్షం..

బాన్సువాడ రూరల్ : బాన్సువాడ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో సుమారు గంటపాటు కురిసిన వర్షం పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగించింది. కాగా గట్టుమీది గ్రామాల్లో పలుచోట్ల మొక్కజొన్న, జొన్న పంటలు ఆరబెట్టిన రైతులు ఇబ్బంది పడ్డారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా సునీల్ రాథోడ్



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : కామారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా సంగం గ్రామానికి చెందిన సునీల్ రాథోడ్ నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ ప్రజల మధ్యన ఉండటంతో జిల్లా స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు.

గ్రంథాలయంలో వైఫై ఏర్పాటు

బాన్సువాడ : బాన్సువాడ గ్రంథాలయంలో మంగళవారం వైఫై ఏర్పాటు చేశారు. నిరుద్యోగుల కోరిక మేరకు జిల్లా గ్రంథాలయం చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి సొంత నిధులతో 8 నెలలకు సరిపడా ఇంటర్నెట్ వైఫైను ఏర్పాటు చేశారు. నిరుద్యోగులు ఉపయోగించుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని గ్రంథపాలకులు సుధాకర్ తెలిపారు.

హరిత ఆర్యవైశ్య సంఘ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం జీవదాన్ ఆస్పత్రి సమీపంలో హరిత కాలనీ వాసవీ హరిత ఆర్యవైశ్య సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సిద్దంశెట్టి వెంకటేశం, కార్యదర్శిగా చిదుర ప్రశాంత్, కోశాధికారిగా బంధం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడుగా కొమిరిశెట్టి గంగరాజు, సంయుక్త కార్యదర్శిగా జలిగామ రామకృష్ణ లు ఎన్నికయ్యారు. హరిత కాలనీలోని ఆర్యవైశ్యుల అభివృద్ధి, ఐక్యతకు కృషి చేస్తామని ప్రకటించారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ధర్మారావ్‌పేట్ గ్రామంలో మంగళవారం రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వలకొండ చిన్న ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా మామిడి అశోక్‌రెడ్డి, కోశాధికారిగా ఏనుగు భాస్కర్ రెడ్డి, కార్యదర్శిగా సామల సంజీవరెడ్డి, సామల బాల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

త్రిశక్తి ఆలయానికి టీవీ బహూకరణ



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులోని త్రిశక్తి అమ్మవారి ఆలయాన్ని రుగ్వేద పండితులు బ్రహ్మశ్రీ నరేంద్ర కాప్రే, దొర్బాల ప్రభాకర్ శర్మలు సందర్శించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి బొందుగులపాటి రవి, అనంత లక్ష్మి దంపతులు టీవీని బహూకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అశ్రద్ధ వహించరాదు



మద్నూర్(జుక్కల్) : చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అశ్రద్ధ వహించరాదని ఆర్‌బీఎస్ వైద్యులు సూచించారు. డోంగ్లీ మండలంలోని చిన్న టాక్లీలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో 0–6 ఏళ్ల పిల్లలకు ఆర్‌బీఎస్ వైద్యులు హెల్త్ చెకప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పిల్లల ఎత్తు, బరువు, ఆరోగ్య పరిస్థితులపై పరిశీలించారు. వేసవికాలం ఎండల్లో పిల్లలను ఆడనివ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. పిల్లలకు బాలామృతం ప్లస్ పై వైద్యుడు శ్యామ్ అవగాహన కల్పించారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

బాన్సువాడ/భిక్కనూరు/పిట్లం : కార్మికుల కోసం ప్రవేశపట్టిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బాన్సువాడలో సబ్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కు కార్మికులు వినతి పత్రం అందజేశారు. భిక్కనూరులో వ్యవసాయాకార్మికసంఘం నాయకులు తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. పిట్లం సివిల్ సప్లయి గోదాం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాస్ రాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బుర్రెం బాలరాజ్, వ్యవసాయాకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు మాట్లాడారు. కార్మిక వర్గం దశాబ్ద కాలంగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సమూలంగా రద్దు చేయడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెను జూలై 9న నిర్వహించనున్నట్లు తెలిపారు.





బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారి నవీన్‌కు వినతిపత్రం అందిజేస్తున్న కార్మికులు, భిక్కనూరులో తహసీల్దార్‌కు..



పిట్లంలో నిరసన తెలుపుతున్న కార్మికులు